క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జూబిలీ ఇండోర్ సబ్‌స్టేషన్, 11 కేవీ డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 27వ తేదీ ఆదివారం ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలరెడ్డిరోడ్డు, డీజీపీ ఆఫీస్, సాయిరామ్ హోటల్ ఏరియా, నక్కలరోడ్డు ఆంధ్రా హాస్పిటల్ ఏరియా, ప్రకాశం రోడ్ సీఎస్ఐ చర్చి ఏరియా, భవానీ వీధి, విష్ణువర్ధనరావు వీధి కొంత భాగం, కాళేశ్వరరావు రోడ్డు రామన్ అకాడమీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు టి.క్రాంతికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 28వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.రత్నకమల్ బాబు క్లాసులు బోధిస్తారని పేర్కొన్నారు. ప్రాజెక్టర్, స్క్రీన్ ద్వారా అధునాతన పద్ధతుల్లో ఇంగ్లిష్‌ను నేర్పడం, మాట్లాడిస్తారని వివరించారు. ఆసక్తి గలవారు 93985 26793, 94900 98408 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి ఠాగూర్ లైబ్రరీలో వేసవి శిక్షణ శిబిరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి కంచల నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులు వినియోగించుకోవడానికి ఏపీ పౌర గ్రంథాలయ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని పేర్కొన్నారు. నగరంలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ శిబిరంలో పిల్లలకు కథలు చెప్పడం, పుస్తక సమీక్షలు, పుస్తకాలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పడం, చిత్రలేఖను నేర్పించడం, పెద్దలతోవివిధ విజ్ఞాన దాయకమైన అంశాలపై ప్రసంగాలు, పేపర్ ఆర్ట్స్ నేర్పించడం వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

20 రోజులుగా నీరు అందక ఇబ్బందులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం ఎస్సీ ఏరియాలో బోరు ఎండిపోయి గత 20 రోజులుగా నీరు రాక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, వార్డు సభ్యుడు ప్రత్తిపాటి సుందరయ్య శనివారం సర్పంచి కాటూరి సరళను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎండాకాలంలో నీరు రాకపోవడంతో కనీస అవసరాలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మంచినీటి చెరువులో నీరు ఫిల్టర్ కావడంలేదని, అదే నీరు ట్యాంక్‌లకు సరఫరా చేయడంతో గత్యంతరం లేక ఫిల్టర్ కాని నీటినే ప్రజలు తాగుతున్నారని తెలిపారు. సీఎస్ఐ చర్చి ఎదురుగా రోడ్డు, వాటర్ ట్యాంక్ రోడ్డు నిర్మాణంతో పాటు డ్రెయినేజీ నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు.

మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నిరసన గళం

పెనమలూరు: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు అమానుషంగా కాల్పులు జరిపి పర్యాటకులను హతమార్చిన ఘటనపై పోరంకిలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘం శనివారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిగడప మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను హతమార్చటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగులు మోటూరి శంకర్‌రావు, గోపాలకృష్ణ, ఠాగూర్, అబ్దుల్ ఖలీల్, ఎస్‌కె.వలి, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, బోడె వెంకట్రామ్, రామినేని శివాజీ, పలువురు పాల్గొన్నారు.

రోడ్లపైనే భవన నిర్మాణ సామగ్రి

- సింగ్‌నగర్ పరిధిలో పలు ప్రాంతాల్లో వారాల తరబడి రోడ్లపైనే..
- వాహన రాకపోకలకు ఇబ్బంది
- పట్టించుకోని వీఎంసీ అధికారులు


లూనా సెంటర్‌లో రోడ్లపైనే వేసిన ఇసుక, ఇటుకలు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో ఏ వీధి చూసినా రోడ్లపైనే భవన నిర్మాణ సామగ్రిని వారాలు తరబడి వదిలేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతాల్లో వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నలభై అడుగుల రోడ్లలో సగానికిపైగా ఆక్రమించి ఇసుక, కంకర, ఐరన్ రాడ్లు, ఇటుకలను నిర్మాణదారులు లోడింగ్ చేయడంతో ఆ రోడ్లలో కనీసం నడిచే దారి కూడా లేకుండా పోతోంది. ముఖ్యంగా లూనా సెంటర్, లెనిన్ సెంటర్, మసీద్ రోడ్లలో సమస్య తీవ్రంగా ఉంది.

జారిపడుతున్నారు

ఇసుక, కంకర రోడ్డు మొత్తం వ్యాపించడంతో వాహనచోదకులు జారి పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. భవన యజమానులకు చెప్పినా పట్టించుకోకపోగా తమపై దాడులకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. సైకిళ్లపై ఆడుకునే పిల్లలు కంకరలో జారిపడి ఇటీవల ఇద్దరు గాయాలపాలైన ఘటనలు చోటు చేసుకున్నాయి. భవన నిర్మాణానికి అనుమతులు తీసుకునే సమయంలోనే రోడ్లపై నిర్మాణ సామగ్రి నిలపకుండా చూడాలని ఆదేశాలు ఉన్నా యజమానులు వాటిని లెక్కచేయడం లేదు.

కన్నెత్తి చూడని అధికారులు

అనుమతి లేకుండా భవనాలు నిర్మించడమే కాకుండా.. ప్రధాన రోడ్లపైనే భవన నిర్మాణ సామగ్రిని రోజులు తరబడి నిలుపుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందుగానే భవన నిర్మాణ యజమానుల నుంచి ముడుపులు అందుకున్న కారణంతోనే అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


నాగసాయి దేవాలయం రోడ్డులో ..

రాత్రిళ్లు మరీ ఇబ్బందిగా..



రోజుల తరబడి రోడ్లపైనే ఉంటున్న ఇసుక, కంకర జారి దారంతా వ్యాపించడంతో జారి కిందపడుతున్నాం. ముఖ్యంగా రాత్రుళ్లు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఇటీవలే ఇద్దరు వాహనచోదకులు జారి గాయపడిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు దృష్టి పెట్టి రోడ్లపై భవన నిర్మాణ సామాగ్రి తొలగించడానికి చర్యలు తీసుకోవాలి.

– శివారెడ్డి, స్థానికుడు

యోగా, ధ్యానంతో ఒత్తిళ్లను జయించవచ్చు


సందీప్‌రాయ్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): యోగా, ధ్యానంతో ఒత్తిళ్లను జయించవచ్చని ఎంజీఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడిసిన్ హెడ్ నవీ ముంబయిలోని అపోలో ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ సందీప్‌రాయ్ అన్నారు. నగరంలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం ప్రస్తుత సమాజంలో ఒత్తిళ్లు.. సహజ యోగ ప్రక్రియతో ఎదుర్కొనే పద్ధతులపై కళాశాలలో అకడమిక్ బ్లాక్‌లో సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ సందీప్‌రామ్ మాట్లాడుతూ ఎంత బిజీగా జీవితాన్ని గడుపుతున్నా, సమాజంలో ఎదురయ్యే ఒత్తిళ్లను తగ్గించుకోవాలన్నారు. లేకపోతే అనేక రుగ్మతలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఒత్తిడి ఉంటే దీర్ఘకాలిక మానసిక, ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. సహజయోగ ధ్యాన ప్రక్రియలు, వైద్య విధానంతో ఒత్తిళ్లను జయించవచ్చని పేర్కొన్నారు. ముంబయికి చెందిన డాక్టర్ మాధురీరాయ్ మాట్లాడుతూ సామాజిక, శారీరక, మానసిక భావోద్వేగ అనారోగ్య సమస్యలకు, రుగ్మతలకు చక్కటి, సులభమైన పరిష్కారం సహజ యోగమన్నారు. కార్యక్రమంలో ఎస్పీఎం అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.ప్రభాకర్, విజయశ్రీ, యోగా ట్రస్టు ప్రతినిధులు అడపా రామ్మోహనరావు, ఎస్ శంకర్, దేసు జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి త్యాగరాజస్వామి జయంతి ఉత్సవాలు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సద్గురు సంగీత సభ సభ్యులు

విజయవాడకల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యాన ఈ నెల 27వ తేదీ ఆదివారం ఉదయం 9 నుంచి మే 4వ తేదీ రాత్రి 9 గంటలవరకు సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన సంగీతోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ వివరాలను సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహించే సంగీత ఉత్సవాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్వాంసులు కచేరీలు చేస్తారన్నారు. ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ మాట్లాడుతూ యువ సంగీత కళాకారులకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. గాయనీ గాయకులు త్యాగరాజస్వామి రచించిన గీతాలను గానం చేయాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బి.హరిప్రసాద్, సహాయ కార్యదర్శి జేఎస్ఎస్ ప్రసాద్ శర్మ, సభ్యులు గాయత్రి గౌరీనాథ్ పాల్గొన్నారు. అతిథులు కార్యక్రమ వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

క్రీడల్లోనూ రాణించాలి


చిన్నారులకు హాకీ స్టిక్స్, బాల్స్, కోన్స్ పంపిణీ చేస్తున్న భవానీప్రసాద్ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌బీఐ మాజీ డెప్యూటీ జనరల్ సెక్రటరీ వి.భవానీప్రసాద్ చిన్నారులకు సూచించారు. సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియంలో మే ఒకటో తేదీ నుంచి జరగబోయే హాకీ సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ తీసుకునే చిన్నారులకు హాకీ స్టిక్స్, బాల్స్, కోన్స్‌ను శనివారం ఆయన బహూకరించారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ హాకీ జాతీయ క్రీడ అని.. దీనికి రాష్ట్రంలో ఆదరణ తక్కువగా ఉందన్నారు. సింగ్‌నగర్ ప్రాంతంలో చిన్నారులు, యువత హాకీ ఆడటానికి ముందుకు రావడం శుభపరిణామమని.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ప్రతిభ చూపితే భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటా ఫ్రీ సీట్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా వస్తాయన్నారు. ఈ ప్రాంతంలోని చిన్నారులకు హాకీ కోచింగ్ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తున్న కోచ్ రాజశేఖర్‌ను అభినందించి సత్కరించారు. ఎస్‌బీఐ రీజనల్ సెక్రటరీ కె.బదరిబాబు, స్టేట్ బ్యాంక్ హాకీ కెప్టెన్ ప్రభుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలు తప్పక పాటించాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని.. జాగ్రత్తలను తప్పక పాటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. సీపీఐ నాయకుడు కేవీ భాస్కరరావు ఆధ్వర్యంలో పాదచారులకు ఫ్రూట్ సలాడ్, మజ్జిగ, టోపీల పంపిణీ కార్యక్రమం సింగ్‌నగర్ పైపులరోడ్డు సెంటర్‌లో శనివారం జరిగింది. శంకర్ మాట్లాడుతూ ఎండలు మండిపోతున్నాయని నగరపాలక సంస్థ అధికారులు చలివేంద్రాలతో పాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు కూడా నిర్వహించాలని కోరారు. సీపీఐ ఎప్పుడూ ప్రజల పక్షంగా నిలుస్తుందని.. తాము పోరాటాలతో పాటు సేవా కార్యక్రమాల్లో కూడా ముందంజలో ఉంటామన్నారు. కార్యక్రమంలో నగర ప్రజానాట్యమండలి అధ్యక్షుడు షేక్ నజీర్, బాష, కంది ఆదినారాయణ,వి.పాపారావు, ఎం.గురునాథం, టి.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

యువ సంగీత విద్వాంసులకు ఆదర్శం 'అన్నవరపు'


అన్నవరపు రామస్వామికి పురస్కారం ప్రదానం చేస్తున్న గుప్తా, సుధాకర్, అంజనా సుధాకర్

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు అన్నవరపు రామస్వామి సంగీత సేవలు వెలకట్టలేనివని స్వరఝురి సంగీత సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ అన్నారు. ఆయన యువ సంగీత విద్వాంసులకు ఆదర్శమని చెప్పారు. స్వరఝురి 37వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో శనివారం వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామికి చింతలపాటి రాజ్యలక్ష్మి స్మారక పురస్కారం, మల్లాది కార్తీక త్రివేణి శాస్త్రీయ సంగీత కచేరి, గ్రంథావిష్కరణ చేశారు. మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ పారపల్లి రామకృష్ణయ్య పంతులు వద్ద వయోలిన్‌లో శిక్షణ తీసుకొని స్వయం కృషితో పద్మశ్రీ పురస్కారం వరకు ప్రయాణం సాగించినట్లు తెలిపారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ అన్నవరపు నిబద్ధత ఉన్న విద్వాంసులని, దేశ విదేశాల్లో కచేరీలు నిర్వహించారన్నారు. సుధాకర్ దంపతులు రామస్వామికి నూరు కమలాలతో చేసిన వెండిమాలను అందజేశారు. సత్కార కార్యక్రమంలో మల్లాది సూరిబాబు, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. వీణ విద్వాంసులు వీఎల్ నారాయణ రచించిన జనకరాగ గ్రహబేధ మంజరి గ్రంథాన్ని సంగీత కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసమ్మ ఆవిష్కరించారు. మల్లాది కార్తీక త్రివేణి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి సంగీత వైభవాన్ని చాటింది.

విద్యతోపాటు క్రమశిక్షణ అవసరం


సదస్సులో విద్యార్థులను మోటివేట్ చేస్తున్న సోమేశ్వరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యతోపాటు క్రమశిక్షణ తప్పనిసరిగా అవసరమని స్టూడెంట్ మోటివేటర్ సోమేశ్వరరావు అన్నారు. విజయవాడలోని సాయిమేధ శిక్షణ సంస్థలో శనివారం క్రమశిక్షణ, నడవడిక, ఉద్యోగ అవకాశాలు అంశంపై సదస్సు జరిగింది. ఆ సంస్థ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సోమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా నడవడిక, ప్రవర్తన, సమయపాలన వంటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్రమశిక్షణను జీవనశైలిలో భాగంగా మలచుకున్న విద్యార్థులు ఏ రంగంలోనైనా అత్యుత్తమ విజయాలు సాధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఈ-సెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేసిన సోమేశ్వరరావు ప్రేరణాత్మక సూచనలు చేశారు.

ఉగ్రవాదుల దాడి హేయం

విశ్వ ఆయుర్వేద పరిషత్


ఆయుర్వేద కళాశాల ఆవరణంలో నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు, వైద్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని వక్తలు పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్‌గాంలోని పర్యాటక ప్రాంతంలో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన మారణకాండకు నిరసనగా శనివారం విశ్వ ఆయుర్వేద పరిషత్ కృష్ణా రీజియన్, ఏపీ రాష్ట్ర శాఖల ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్ఆర్ఎస్ ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజ్ ఆవరణలో నిరసన ప్రదర్శన జరిగింది. ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేశారు. కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఏపీ విశ్వ ఆయుర్వేద పరిషత్ జనరల్ సెక్రటరీ డాక్టర్ సాహితీ మాట్లాడుతూ పర్యాటకులపై దాడి హేయమైన చర్య అన్నారు. కృష్ణా రీజియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ నల్లు ధరణి కుమార్ మాట్లాడుతూ ఈ విపత్కర సమయంలో భారతీయులంతా ఒకటిగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ బుల్లయ్య డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రాజ్ కమలాకర్, కాలేజీ విద్యార్థులు, హౌస్ సర్జన్స్ పాల్గొన్నారు.

వాంబే కాలనీలో కార్డన్ సెర్చ్


వాంబే కాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసు అధికారులు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న పోలీసుస్టేషన్ పరిధి వాంబే కాలనీలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇన్‌చార్జి డీసీపీ జి.రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన సెర్చ్‌లో ఎ-బ్లాక్‌లోని 16 అపార్ట్‌మెంట్స్‌లో 512 ఫ్లాట్లను, 1042 మందికి పైగా నివాసితులను తనిఖీ చేశారు. 73 వాహనాలు తనిఖీలు నిర్వహించి రికార్డ్స్ లేని 16 వాహనాలు సీజ్ చేశారు. ఐరిస్ వాహనం ద్వారా 83 మందిని తనిఖీ చేయగా వారిలో ఇద్దరు రౌడీ షీటర్లు, ఒ క్రైమ్ సస్పెక్ట్ షీటర్, గతంలో పలు కేసుల్లో ప్రమేయం ఉన్న మరో ఇద్దరిని మొత్తం ఐదుగురిని గుర్తించారు. కార్డన్ సెర్చ్‌లో నార్త్ డివిజన్ ఏసీపీ డాక్టర్ కె.స్రవంతి రాయ్, నున్న సీఐ పి.కృష్ణమోహన్, ఏఎస్ నగర్ సీఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ పురం సీఐ లక్ష్మీనారాయణ, వన్‌టౌన్ సీఐ జి.గురు ప్రకాష్, టూ టౌన్ సీఐ కొండలరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొని ఉదయం 5 నుంచి 8 గంటల వరకు నిర్వహించారు.

మధురై కార్పొరేషన్‌లో అమృత్ ప్రాజెక్ట్ అధ్యయనం


మధురై కార్పొరేషన్ వద్ద వీఎంసీ కార్పొరేటర్లు

పటమట(విజయవాడతూర్పు): మధురై ప్రజలకు రూ. 2 వేల కోట్లతో 24/7 తాగునీటి సరఫరా జరుగుతోందని మధురై మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఇంద్రాణి పొన్వసంత్ వీఎంసీ కార్పొరేటర్లకు తెలిపారు. విజ్ఞాన యాత్రలో వీఎంసీ కార్పొరేటర్లు శనివారం అన్నమలైలోని మధురై మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించారు. అమృత్ ప్రాజెక్టును అధ్యయనం చేశారు. తొలుత కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ గదిలో వీఎంసీ డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, టీడీపీ డెప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లకు స్వాగతం పలికారు. మేయర్ ఇంద్రాణి పొన్వసంత్, కమిషనర్ చిత్ర విజయన్ అభివృద్ధి పనులను వీఎంసీ కార్పొరేటర్లుకు వివరించారు. మధురై నగరంలో 100 వార్డులు, ఐదు జోనులు ఉన్నాయని, తమిళనాడు రాష్ట్రంలో రెండో అతిపెద్ద కార్పొరేషన్ అని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీలాగా ఉన్న వారి కౌన్సిల్ హాల్‌ను చూపించారు. మధురై నగరం స్మార్ట్ సిటీ అని, పెరియార్ బస్టాండ్‌ను రూ.174.56 కోట్ల నిధులతో ఐదు అంతస్తులు నిర్మించారని చెప్పారు. కార్పొరేటర్లు భవన స్ట్రక్చర్, వాటర్ డ్రైన్లు, వర్షం నీటిని ఫైర్ సేఫ్టీ కోసం వాడుతున్న విధానాన్ని అధ్యయనం చేసి విజయవాడలో కూడా ఇటువంటివి ఎంతో ముఖ్యమైనవని వీటి అమలుకు ప్రణాళికను రూపొందిస్తామని కార్పొరేటర్లు తెలిపారు.

సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్‌కే డేవిడ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార హక్కు చట్టం పారదర్శకంగా అమలు చేయాలని ప్రజాపరరిక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఆర్‌ఏ డేవిడ్ అన్నారు. శనివారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సమితి ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాచార కమిషన్లు పూర్తి స్వేచ్ఛ, స్వతంత్రంగా పనిచేసేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా ఆర్టీఐ చట్టం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రజలు కోరిన సమాచారాన్ని నిర్దేశించిన సమయానికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు పర్వతనేని హరికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి పి.రవికుమార్, గౌరవ అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు, అడ్వకేట్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): భార్యను వేధిస్తున్న భర్తపై నున్న పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పాయకాపురం సుందరయ్యనగర్‌కు చెందిన యాదాల తేజస్వినికి మెట్లపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు ఆడపిల్లలు. అప్పటి నుంచి అత్తమామలు వేధించడంతో పాయకాపురం సుందరయ్యనగర్‌కు వచ్చి కుటుంబం ఉంటోంది. అత్తమామలు తరచూ ఫోను చేసి లేనిపోని మాటలు చెప్పడంతో తన భర్త ప్రతి రోజూ మద్యం సేవించి శారీరరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు.


విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సరైన వసతి లేక అరుగులపై ఇలా..


ఓపీ కౌంటర్ల వద్ద ఇబ్బందే..





వెళ్లే దారి లేదు..
కూర్చునే వీలులేదు

నగరంలోని పాత ప్రభుత్వాస్పత్రి ఆవరణలో కూర్చునే చోటు లేక.. వాహనాలు వెళ్లే దారి లేక రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడుతున్నారు. ఓపీ కౌంటర్ల వద్ద, స్కానింగ్, రక్త పరీక్షల వద్ద వేచి ఉండలేక అక్కడ కూర్చునే అవకాశం లేక గర్భిణులు, చంటిపిల్లల తల్లులు.. అంబులెన్సులు, ఇతర వాహనాల వెళ్లే దారిలో అరుగుల వద్ద కూర్చుంటున్నారు. ఆస్పత్రి ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతుండటంతో అంబులెన్సులు, ఇతర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితులు ఉన్నా ఆస్పత్రి ఉన్నతాధికారులు ఇక్కడ రోగులకు అవసరమైన వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న జాడ కానరావడం లేదు. ఇలాంటి దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ